నమస్తే తెలంగాణ
నల్లగొండ
3 | నల్లగొండ, శనివారం 13 జనవరి 2024 | NALGONDA

గండి చెరువుకు కాళేశ్వరం జలాలు

యాదగిరిగుట్ట, జనవరి 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి చెంతకు మల్లన్న సాగర్ జలాలు వచ్చాయి. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొండకండ్ల గ్రామంలోని క్రాస్ రెగ్యులేటర్ వద్ద 15వ ప్యాకేజీ ప్రధాన కాల్వలోకి ఇరిగేషన్ అధికారులు శుక్రవారం ఉదయం నీటిని విడుదల చేశారు. అక్కడి నుంచి 15వ ప్యాకేజీ ప్రధాన కాల్వ గుండా యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని ముల్కలపల్లి నుంచి కాళేశ్వరం 16వ ప్యాకేజీ ప్రధాన కాల్వ వరకు వచ్చాయి. అక్కడి నుంచి 16వ ప్యాకేజీ ప్రధాన కాల్వ 8వ కిలోమీటరు వద్ద నిర్మించిన బ్రాంచ్ కెనాల్ గుండా యాదగిరిగుట్ట కొండ కింద నిర్మించిన గండి చెరువులోకి గోదావరి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. ప్రస్తుతం గండి చెరువులో నీళ్లు తగ్గుముఖం పట్టడంతో గోదావరి జలాలతో మరోసారి చెరువును నింపుతున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు వెల్లడించారు. రెండు నెలల్లో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఉన్నందున నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

భువనగిరిపై గులాబీ జెండా ఎగురాలి

పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పని చేద్దాం

- ఓటమితో ఎవరూ అధైర్యపడొద్దు.. భవిష్యత్ మనదే
- సర్కారు ప్రజా వ్యతిరేక వైఖరులను ఎండగడుదాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం
- తెలంగాణ భవన్‌లో భువనగిరి పార్లమెంట్ స్థాయి సమావేశం
- హాజరైన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలను సమీక్షించుకుని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పని చేద్దామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ నేతలు, శ్రేణులకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి సీటుతో సహా మెజార్టీ స్థానాలను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పార్టీ తరపున అభ్యర్థిగా ఎవరున్నా అంతా సమన్వయంతో గెలుపు కోసం కృషి చేయాలన్నారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటే అవకాశం ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. రానున్న కాలం తిరిగి బీఆర్ఎస్‌దేనని, అధినేత కేసీఆర్ సారథ్యంలో పార్టీని ఆ దిశగా నడిపిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో పాటు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజాప్రతినిధులు, కీలక నేతలంతా హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పార్టీ నేతల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ దిశానిర్దేశం చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో నిరాశ చెందాల్సిన అవసరం లేదంటూ భవిష్యత్ అంతా గులాబీ పార్టీదేనని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు

రోజంతా సుదీర్ఘ సమాలోచనలు

తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశానికి భువనగిరి లోక్‌సభ పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతలు హాజరయ్యారు. సుమారు వెయ్యి మంది వరకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఉదయం 11:50 గంటలకు ప్రారంభమైన సమావేశం సుదీర్ఘంగా కొనసాగింది. హాల్‌లోకి వెళ్లే ముందు నాయకుల వివరాలను రిజిస్టర్ చేసుకున్నారు. కాంగ్రెస్ చేసిన 420 హామీల వివరాలతో కూడిన బుక్‌ను అందించారు. మధ్యలో అరగంట పాటు లంచ్ బ్రేక్ అనంతరం తిరిగి సమావేశం కొనసాగించారు. సాయంత్రం 6:20 గంటల వరకు సమావేశం నాన్‌స్టాప్‌గా కొనసాగింది. వేదిక మీద ఉన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడి, ఇతర ముఖ్య నేతలతోపాటు వేదిక కింద ఉన్న పార్టీ నాయకులు సైతం తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిసింది. చివరగా కేటీఆర్ స్పందిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరపున ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా అందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల మద్దతుతో ఎండగడుతూ నిలదీయాలని కేటీఆర్ సూచించారు. 'కొత్త ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిద్దామనే సదుద్దేశంతో ఉంటే.. ప్రభుత్వ పెద్దలే రెచ్చగొడుతున్నారు. గవర్నర్ ప్రసంగం ద్వారా ఉద్దేశపూర్వకంగా కవ్వించారు. రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో మనం కూడా గట్టిగా సమాధానం చెప్పక తప్పని స్థితి కల్పించారు. అందులో భాగంగా కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పకొట్టాల్సి వస్తుంది. గెలుస్తామనే విశ్వాసం లేని స్థితిలో.. అధికారం కోసం అర్రులు చాచి.. అలవికాని హామీలిచ్చి.. నేడు వాటిని అమలు చేయలేక చేతులెత్తేసే క్రమంలో శ్వేతపత్రాల పేరుతో నాటకాలు ఆడుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదు.. ఎస్సీ, బీసీ, మహిళా తదితర డిక్లరేషన్లతో కలిపి అవి సరిగ్గా 420 ఉన్నాయి. తక్షణమే రైతుబంధు, రుణమాఫీ, ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. కాంగ్రెస్ మోసపూరితర వాగ్దానాలతో అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో వాటిని ప్రజలకు వివరించడంలో ఫెయిలయ్యాం. ఇప్పటికైనా వాటిని నెరవేర్చేలా పోరాటాలు చేద్దాం. కేసీఆర్ తయారు చేసిన జగదీశ్‌రెడ్డి, తమ వంటి కార్యకర్తలే అసెంబ్లీలో దీటుగా తిప్పకొడితే.. త్వరలో స్వయంగా కేసీఆరే వస్తే పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించండి' అంటూ కేటీఆర్ అన్నారు.

పార్టీ బలోపేతంపై మరింత దృష్టి

బీఆర్ఎస్ నిజమైన సెక్యులర్ పార్టీ అని కేటీఆర్ పునరుద్ఘాటించారు. రానున్న రోజుల్లో సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. పార్టీనే సుప్రీం అనేలా యంత్రాంగాన్ని తీర్చిదిద్దాలని, పార్టీలో క్రమశిక్షణకు పెద్ద పీట వేస్తామని చెప్పారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా పార్టీ యావత్తు అండగా ఉండే పద్ధతిని నేతలు అవలంబించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ప్రొటోకాల్ ఉల్లంఘనలు సీరియస్‌గా తీసుకుంటామని, తప్పుడు కేసులను చట్టపరంగానే ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గుజ్జ దీపికాయుగేంధర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దూదిమెట్ల బాలరాజుయాదవ్, పల్లె రవికుమార్‌గౌడ్, రాజీవ్ సాగర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు వేమిరెడ్డి నర్సింహారెడ్డి, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, పాల్వాయి స్రవంతి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

22న నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష

సంక్రాంతి పండుగ సందర్భంగా బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలకు రేపటి నుంచి ఈ నెల 16 వరకు విరామం. మళ్లీ 17నుంచి యథావిధిగా సమావేశాలు కొనసాగుతాయి. దీంతో ఈ నెల 16న జరుగాల్సిన నల్లగొండ పార్లమెంటు సన్నాహక సమావేశం ఈ నెల 22కు వాయిదా పడింది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై సమీక్ష

భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఫలితాలపై కేటీఆర్ సమీక్షించారు. ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ.. గెలుపోటముల కారణాలపై పార్టీ నేతల నుంచి ఆరా తీశారు. పార్టీ నాయకులు, శ్రేణుల కృషి, ప్రచారం.. ప్రజల భావన తదితర అంశాలపై పార్టీ నేతలు తమ అభిప్రాయాలు చెప్పారు. 'బీఆర్ఎస్‌ను ప్రజలు నిర్విద్వంగా తిరస్కరించలేదు. ఎన్నికల ప్రచారంలో ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫలితాల్లో మాత్రం భిన్నత్వాన్ని చూపించారు. రాష్ట్రంలో ఆరు లక్షలకు పైగా రేషన్ కార్డులు ఇచ్చాం. ప్రతి నియోజకవర్గంలో 15వేలకు పైగా కొత్త పింఛన్లు ఇచ్చాం. అయినా ఇలాంటి వాటిని జనంలోకి తీసుకపోలేక పోయాం. ఎందుకిలా జరిగిందో విశ్లేషించుకుందాం.' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ లోటుపాట్లను సమీక్షించుకోవడం ద్వారానే లోక్‌సభ ఎన్నికలకు పూర్తి స్థాయిలో సమాయత్తం కాగలమని చెప్పారు.

హాజరైనబీఆర్ఎస్ శ్రేణులు

జిల్లా సాగునీటి ప్రాజెక్టులు రెండేండ్లలో పూర్తి చేయాలి

బ్రాహ్మణ వెల్లెంల లిఫ్ట్, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి సమీక్ష

అధికారులతో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను రెండేండ్లలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా చర్చిస్తూ పనులు త్వరగా పూర్తి చేసేలా దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండడం ప్రజల అదృష్టమని చెప్పారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఉదయ సముద్రం బ్రాహ్మణ వెల్లెంల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాల్వల పనులతోపాటు పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ కాల్వల నిర్వహణపై దృష్టి సారిస్తూ మరమ్మతులు చేపట్టాలన్నారు. బెడ్ మరియు సైడ్స్ లైనింగ్ పనులను ఈ సంవత్సరంలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు కింద మొదటి దశలో 50వేల ఎకరాలకు, రెండో దశలో మరో 50 వేల ఎకరాలకు సంబంధించిన భూ సేకరణతోపాటు కాల్వ తవ్వకాల పనులను పూర్తి చేసి లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీళ్లు అందించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉదయ సముద్రం మొదటి దశ భూ సేకరణకు సుమారు రూ.100 కోట్లు, పనులకు మరో 100 కోట్ల రూపాయలను విడుదల చేస్తామని చెప్పారు. నల్లగొండ జిల్లా ప్రాజెక్టుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కావల్సిన సహకారం అందిస్తామని చెప్పారని వివరించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ సెక్రెటరీ రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ మురళీధర్‌రావు, చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, డిప్యూటీ ఈఎన్‌సీ జనరల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నల్లగొండలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో కూడారై ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా కూడారై ఉత్సవం

రామగిరి, జనవరి 12 : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో శుక్రవారం కూడారై ఉత్సవం వైభవంగా నిర్వహించారు. రామగిరిలోని రెండో భద్రాద్రిగా పేరుగాంచిన సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆండాళ్ అమ్మవారు, తిరుమన్నార్ రంగనాథస్వామికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం కూడారై ఉత్సవంలో 108 గిన్నెలతో చక్కెర పొంగలిని ప్రసాదంగా స్వామి, అమ్మవార్లకు నివేదించారు. అదేవిధంగా నిరాటోత్సవం చేశారు. కూడారైని పురస్కరించుకుని తెల్లవారుజామున 5గంటల నుంచే భక్తులు ఆలయాలకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున, రాత్రి వేళ ప్రముఖ ప్రవచకులు శ్రీమాన్ నల్లాన్‌చక్రవర్తుల రామకృష్ణమాచార్యులు తిరుప్పావై ప్రవచనాలు చేశారు. సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, ఆండాళ్ అమ్మవారిని కీర్తిస్తూ గోదాదేవి పాశురాలను వివరించారు. ఆలయ ఈఓ టి.జయరామయ్య, ప్రధానార్చకుడు సముద్రాల యాదగిరాచార్యులు, అర్చకులు శఠగోపాచార్యులు, రఘుచార్యులు, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా పానగల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు కందాల శ్రీనివాసాచార్యులు కూడారై ఉత్సవం నిర్వహించారు. వీటీ కాలనీ శ్రీదేవీ భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో, పాతబస్తీలోని సంతోషిమాత–ఆంజనేయస్వామి దేవాలయంలో, సిద్దార్థ కాలనీ, ఆనందనగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్యాపేటలో..

బొడ్రాయిబజార్ : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి దేవస్థానాల్లో శుక్రవారం కూడారై పాయస నివేదన కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల మురళీధరాచార్యులు ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరిపించారు. జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సుమారు 1200 మందికి ప్రత్యేకంగా తయారు చేసిన ఈ పాయస ప్రసాదాన్ని అందజేస్తున్నామని ఆలయ అర్చకుడు వేణుగోపాలాచార్యులు తెలిపారు. పాలు, నెయ్యితో ప్రత్యేకంగా తయారు చేసే ఈ ప్రసాదం శ్రీకృష్ణుడికి ఎంతో ఇష్టమని వివరించారు. కార్యక్రమంలో ఆలయాల సహాయ అర్చకులు, ఆండాళ్, వికాస తరంగిని భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

నల్లగొండలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో కూడారై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికల జిల్లా జట్టు

నల్లగొండ రూరల్, జనవరి 12 : ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగే 45వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా బాలికల జట్టును ఎంపిక చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎంపిక పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి మక్బూల్ అహ్మద్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాండ్ బాల్ క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఎండీ ఉస్మాన్, కోచ్‌లు గుప్తా, రామాంజనేయులు, వరమ్మ, వరుణ్, మహేశ్, రామకృష్ణ, సాయిలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు క్రీడాకారులతో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

అటెండెన్స్ యాప్‌పై అనుమానాలెన్నో..!

- అన్నీ చూసుకోకుండానే ఆదరాబాదరాగా ప్రారంభం
- ఇప్పటికే కలెక్టరేట్‌లో అమలు
- త్వరలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటుకు యోచన
- స్మార్ట్ ఫోన్లు లేకపోవడంతో చిరు ఉద్యోగుల కష్టాలు
- వ్యక్తిగత ప్రైవసీ కూడా కోల్పోయే ప్రమాదం

సూర్యాపేట, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల అటెండెన్స్ కోసం సూర్యాపేట డిస్ట్రిక్ట్ అటెండెన్స్ మేనేజ్‌మెంట్ యాప్‌ను తీసుకొస్తున్నారు. ఈ యాప్‌ను ఇటీవలే కలెక్టరేట్‌లో ప్రారంభించగా.. త్వరలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమల్లోకి తీసుకురానున్నట్లు తెలుస్తున్నది. అయితే.. ఈ యాప్‌పై ఉద్యోగులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. యాప్ వల్ల జరిగే లాభనష్టాలను బేరీజు వేసుకోకుండానే ఆదరాబాదరాగా ప్రారంభించారని వాపోతున్నారు. యాప్‌తో ఉదయం చెక్ ఇన్, సాయంత్రం చెక్ ఔట్ ఆప్షన్లు నొక్కాల్సి ఉండగా.. కింది స్థాయి ఉద్యోగుల్లో 60 శాతం మందికి స్మార్ట్ ఫోన్లు లేకపోవడంతో ఇబ్బంది కానుంది. అంతేకాదు.. యాప్ ద్వారా ఏ ఉద్యోగి ఎప్పుడు, ఎక్కడ ఉంటాడో తెల్వడం ద్వారా వ్యక్తిగత ప్రైవసీని కూడా కోల్పోనున్నారు. ఈ క్రమంలో అవసరమైతే బయోమెట్రిక్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, యాప్‌ను వెంటనే తొలగించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.



పాఠశాలల నుంచి ప్రభుత్వ కార్యాలయం వరకు ప్రతి చోటా ఉద్యోగులు సకాలంలో వచ్చి వెళ్లేందుకు అటెండెన్స్ అనే ప్రక్రియ ఉన్నది. అయితే.. హాజరు అనేది గతంలో మ్యానువల్‌గా ఉండి సంతకాలు చేసేవారు. రానురాను టెక్నాలజీ పెరుగుతూ అనేక రకాల మార్పులు జరుగుతూ వచ్చాయి. అటెండెన్స్ రిజిస్టర్ నుంచి బయోమెట్రిక్, ఫేస్ రికగ్నైజ్ వంటి అనేక రకాల ఈ–అటెండెన్స్‌లు అమల్లోకి వచ్చాయి. ఇలాంటి మార్పులతో ఉద్యోగికి నష్టం చేకూరనంత వరకు బాగానే ఉంటుంది. ఒకవేళ నష్టం చేకూరే అవకాశం ఉంటే ఆచితూచి అమలు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సూర్యాపేటలో ఉన్నతాధికారులు ఒక యాప్‌ను తీసుకొచ్చారు. సదరు కార్యాలయానికి వచ్చినప్పుడు ఆ యాప్‌లో చెక్ ఇన్, బయటకు వెళ్లే సమయంలో చెక్ అవుట్ చేయాల్సి ఉంటుంది. చెప్పుకొనేందుకు ఎంతో సులువుగా ఉన్నా.. దీని ద్వారా అనర్థాలు జరిగే ప్రమాదంతోపాటు చిరు ఉద్యోగులపై కాసింత భారం కూడా పడనున్నది. యాప్‌తో అటెండెన్స్ వేయాలంటే కచ్చితంగా స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్ డాటా ఉండాల్సిందే. దాంతోపాటు ఈ యాప్‌ను ప్రైవేట్ వ్యక్తులు తయారు చేసినందున ఉద్యోగుల వేతనాల కోసం ట్రెజరీకి లింక్ చేయనుండడంతో సైబర్ నేరాలు జరిగే ప్రమాదం ఉంటుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. యాప్ వినియోగించే వారు ఎప్పుడు, ఎక్కడ ఉంటారో తెలుసుకునే అవకాశం ఉన్నందున వ్యక్తిగత ప్రైవసీ దెబ్బతిననుంది. ఇప్పటికే జిల్లాలో ఉద్యోగులంతా బాగా పని చేయడం వల్ల రాష్ట్రంలోనే జిల్లాకు మంచి పేరు ఉన్నది. ఈ క్రమంలో ఈ యాప్‌తో సాధించేదేమీ ఉండదని.. దాంతో ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతీయడంతోపాటు స్మార్ట్ ఫోన్లు లేనివారు, అవగాహన లేని చిరు ఉద్యోగులు ఇబ్బందులు పడుతారని పలువురు పేర్కొంటున్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

- యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జనవరి 12 : పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ పనులు, చౌటుప్పల్ క్లస్టర్ రూర్బన్ పనులకు సంబంధించిన ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, రోడ్లు, విద్య, వైద్యం, విద్యుత్ తదితర పూర్తికాని అభివృద్ధి పనులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకున్నారు. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ పనులు 747కు 410 పూర్తయ్యాయని, రూర్బన్ పనులు 11 పూర్తి కావలసి ఉన్నదని సంబంధిత అధికారులు తెలిపారు. పనులను సకాలంలో పూర్తిచేసి ఉపయోగంలోకి తీసుకురావాలని ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, నీటిపారుదల శాఖ జిల్లా అధికారి నరసింహ, డీఈ ఖుర్షీద్, విద్యుత్ డీఈ మల్లికార్జున్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే